క్లుప్తంగా

అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారి

పెద్దపల్లిరూరల్: అగ్నిప్రమాదాలు సంభవిస్తే నియంత్రించేందుకు గల అవకాశాలపై కనీస అవగాహన కలిగియుండాలని ఫైర్ ఆఫీసర్ దేవనంది శ్రీనివాస్ తెలిపారు. పెద్దపల్లి పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో బుధవారం మాక్‌డ్రిల్ నిర్వహించి ఆస్పత్రిలో పనిచేసే సిబ్బందికి అవగాహన కల్పించారు. అకస్మాత్తుగా అగ్నిప్రమాదాలు సంభవిస్తే మంటలను ఆర్పేందుకు అవసరమైన పరికరాలను అందుబాటులో ఉంచుకుని వాటిని వినియోగించే తీరును వివరించారు. సిబ్బంది మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.

లబ్ధిదారులకు చెక్కులు, పట్టాల పంపిణీ


లబ్ధిదారులకు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే

మంథని: డివిజన్ పరిధిలోని ముత్తారం, రామగిరి,పాలకుర్తి మండలాలకు చెందిన 26 మంది కల్యాణ లక్ష్మి చెక్కులు, పాలకుర్తి మండలానికి చెందిన 11 మంది స్వాధీనంలో ఉన్న అసైన్‌మెంట్ పట్టాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు అందించారు. బుధవారం మంథనిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జీవో 58 ప్రకారం అసైన్డ్ భూమిలో ఇండ్లు నిర్మించుకున్న పాలకుర్తి మండలానికి చెందిన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే అందించారు. కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ శశిభూషణ్ కాచే, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతియాదవ్, ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

బీజేపీలో ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం


పార్టీలో చేరిన వారితో సురేశ్ రెడ్డి

సుల్తానాబాద్‌రూరల్: బీజేపీలో సీనియర్, జూనియర్ తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందని బీజేపీ నాయకుడు గొట్టిముక్కల సురేశ్ రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండలం రామునిపల్లిలో బుధవారం బీజేపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించగా ముఖ్య అతిథిగా సురేశ్ రెడ్డి హాజరై మాట్లాడారు. దీంతో కనుకుల నుంచి రామునిపల్లికి బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వివిధ పార్టీల నుంచి 30 మంది బీజేపీలోకి చేరగా పార్టీ కండువాను కప్పి పార్టీలోకి సురేశ్ రెడ్డి ఆహ్వానించారు. కార్యక్రమంలో బూత్ కమిటీ అధ్యక్షుడు రమేశ్,సమ్మిరెడ్డి, కుమార్‌రెడ్డి, దామోదర్, అనిల్ తదితరులున్నారు.

ఎలిగేడులో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల శ్రమదానం


చెత్తను తొలగిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

ఎలిగేడు: మండలకేంద్రంలో శ్రీవాణి డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ పత్యేక శిబిరంలో భాగంగా 5వరోజు వలంటీర్లు శ్రమదానం చేశారు. గ్రామంలో ప్లాస్టిక్ వస్తువులు ఏరివేశారు. జాతీయ యువజన అవార్డు గ్రహీత కొండ రవియాదవ్ ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే గ్రామంలో ఇంటింటికీ తిరిగి 15 ఏళ్ల నుంచి 29 ఏళ్ల మధ్యగల యువతపై సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూర్ల సింధూజ, ఉప సర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, ఎంపీవో అనిల్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రావణ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

సుల్తానాబాద్ రూరల్: సుల్తానాబాద్ మండలం నీరుకుల్లలో రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాల (జాతర)ను గురువారం నుంచి వచ్చేనెల 10వ తేదీవరకు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు గోవర్ధన గిరి మనోహరా చార్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

డిమాండ్ రూ.7 కోట్లు..
వసూలు రూ.2 కోట్లు

- బల్దియాను వేధిస్తున్న నల్లా బిల్లుల బకాయిలు
- ఇప్పటివరకు కేవలం 32 శాతమే వసూలు
- నగరంలో 35,600 కనెక్షన్లు
- రెండు రోజుల్లో ముగియనున్న ఆర్థిక సంవత్సరం


రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలో నల్లా బిల్లుల బకాయిలు భారీగా పేరుకుపోయాయి. ఇంటింటికీ మిషన్ భగీరథ తాగునీటిని సరఫరా చేస్తున్నామని పాలకులు, అధికారులు చెబుతున్నప్పటికీ... నెలనెలా బిల్లులు చెల్లించడానికి మాత్రం వినియోగదారులు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. భారీగా పేరుకుపోయిన బకాయిలే దీనికి నిదర్శనం. ఈనెల 31తో 2022–23 ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఈ నెల 28వ తేదీ వరకు కేవలం 33 శాతం మాత్రమే నల్లా బిల్లులు వసూలు చేయగలిగారు.

డిమాండ్ రూ.7కోట్ల 68లక్షలు..

నగరపాలక సంస్థలో మొత్తం 35,600 వరకు నల్లా కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో కేవలం 10 మాత్రమే కమర్షియల్ కాగా, మిగితావన్నీ డొమెస్టిక్ కనెక్షన్లు ఉన్నాయి. కమర్షియల్‌కు నెలనెలా రూ.400, డొమెస్టిక్ కనెక్షన్ల నుంచి రూ.100 చొప్పున వసూలు చేస్తున్నారు. బల్దియాలో మొత్తం 35,600 నల్లా కనెక్షన్లు ఉండగా, వీటిపై రూ.7కోట్ల 68లక్షల వరకు డిమాండ్ ఉంది.

వసూలు చేసింది రూ.2 కోట్ల 22 లక్షలే..

ఆర్థిక సంవత్సరం ముగింపు గడువు దగ్గర పడుతున్నా... నల్లా కనెక్షన్ బకాయిలు మాత్రం వసూలు కావడం లేదు. తాగునీటి విభాగంలో 10 మంది లైన్‌మెన్లు ఉన్నారు. వీరంతా స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. నల్లా బిల్లులు చెల్లించని వారి నల్లా కనెక్షన్లను తొలగిస్తున్నారు. కానీ, ఈనెల 28వ తేదీ వరకు కేవలం రూ.2కోట్ల 22లక్షలు మాత్రమే వసూలు చేయడంతో, 32 శాతం తక్కువ కలెక్షన్ నమోదైంది.

ఏళ్ల తరబడి రూ.కోటి 50 లక్షల బకాయిలు..

బల్దియాలో నల్లా కనెక్షన్ల నుంచి సుమారు రూ.కోటి 50 లక్షల వరకు ఏళ్ల తరబడి బకాయిలు వసూలు కావడం లేదు. తాగునీటి సరఫరాలో తరుచూ ఏర్పడుతున్న లోపాలు, పైప్‌లైన్లు వేసిన కొద్ది రోజులకే లీకేజీలు, నీటి ప్రవాహం స్పీడు తక్కువగా ఉండడం, నల్లా కనెక్షన్లు ఇచ్చిన వాటికి నీటిని సరఫరా చేయకపోవడం, చాలా ప్రాంతాల్లో ఇప్పటికీ నీటి కనెక్షన్లు ఇవ్వకపోడం తదితర కారణాలతో ప్రజలు బిలులు చెల్లించడానికి ముందుకు రావడం లేదని తెలుస్తోంది. భీమునిపట్నంలో నిర్మాణం పూర్తయిన వాటర్ ట్యాంక్‌ను ఇప్పటికీ ప్రారంభించలేదు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్యాలు


ఎలిగేడు: డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

ఎలిగేడు: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు గ్రామానికి గుర్తింపు తీసుకరావాలని ఎంఈవో కవిత అన్నారు. మండలంలోని ధూళికట్ట, ఎలిగేడు జెడ్పీ హెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో కవిత మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకుని పట్టుదలతో చదివితే వారు ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చునని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో సర్పంచులు గొల్లే కావేరి, భూర్ల సింధూజ, ఉపసర్పంచు కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, హెచ్‌ఎం జీవన్‌రెడ్డి , ఎస్‌ఎంసీ కమిటీ చైర్మెన్లు, ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

రామగిరి: మండలంలోని కల్వచర్ల ప్రభుత్వ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.కార్యక్రమంలో సర్పంచ్ గంట పద్మ, ఉప సర్పంచ్ మేము కనుకయ్య, పాఠశాల హెచ్‌ఎం వనజ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు బుధవారం వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. విద్యార్థులు చేసిన నృత్యాలు అకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం కమలాకర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని సుల్తానాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శారద అన్నారు. బుధవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలోనే అభివృద్ధి


కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే దాసరి

పెద్దపల్లిరూరల్: సీఎం కేసీఆర్ పాలనలోనే తెలంగాణ అన్ని విధాలా అభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లి మండలం కనగర్తి గ్రామానికి చెందిన పలువురు మహిళలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో లావణ్య, రాజేశ్వరి, దేవిక, నర్సమ్మ, స్వరూప, శైలజ, రజిత, అమల, శారద, విండో చైర్మన్ చంద్రారెడ్డి, ఇనుగాల అనంతరెడ్డి, అశోక్ తదితరులున్నారు.

కంటి వెలుగును ఉపయోగించుకోవాలి

జూలపల్లి: కంటి వెలుగు వైద్య శిబిరంలో అందరూ పరీక్షలు చేయించుకోవాలని ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి అన్నారు. బుధవారం మండలంలోని చీమలపేటలో సర్పంచ్ తోంటి పద్మ బుచ్చయ్య, వైద్యాధికారి సంపత్‌రెడ్డి,ఎంపీడీవో వేణుగోపాలరావుతో కలిసి ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్, ఎంపీవో కిరణ్, సీహెచ్‌వో కలీమొద్దీన్, కార్యదర్శి, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

శ్రీసీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి


ఏర్పాట్లు పరిశీలిస్తున్న నాయకులు

సుల్తానాబాద్: పట్టణంలో పలు ఆలయాల్లో శ్రీరామనవమి వేడుకలకు ఆలయాల కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం పట్టణంలోని పెరిగిద్దే హనుమండ్ల, పుసాలలోని మార్కండేయ, శాస్త్రి నగర్‌లో హనుమాన్ ఆలయంలో శ్రీరామనవమి ఏర్పాట్లను మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు, మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యం సునీత, కమిషనర్ రాజశేఖర్, మాజీ సర్పంచ్ అంతటి అన్నయ్య గౌడ్ పరిశీలించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదానం చేయనున్నారు.

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు వడ్కాపూర్,కాచాపూర్, కోనరావుపేట, వెంకట్రావుపల్లె గ్రామాలలోని ఆలయాల్లో సీతా రాముల కల్యాణానికి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు తాగునీరు,చలువ పందిళ్లు, ఏర్పాటు చేశారు. ఆనంతరం భక్తులకు అన్నదానం చేయనున్నారు. వడ్కాపూర్‌లో జరిగే శ్రీ సీతా రాముల కల్యాణోత్సవంలో అన్నదానానికి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ క్వింటాల్ బియ్యాన్ని అందజేశారు.

స్వచ్ఛతా మషాల్ మార్చ్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని జెండాకూడలీలో బుధవారం మున్సిపల్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా మషాల్ మార్చ్ నిర్వహించారు. పెద్దపల్లి పట్టణాన్ని చెత్తరహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా సహకరించాలని మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డి, కమిషనర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. రోడ్లపై చెత్త వేయవద్దని, తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని సూచించారు. సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ ను వినియోగించబోమని జెండా కూడలి వద్ద మేనేజర్ కట్ట శివప్రసాద్ ప్రతిజ్ఞ చేయించారు. కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇంటర్వ్యూ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం దివ్యాంగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీవో రాజు తెలిపారు. ఇంటర్వ్యూకు వచ్చిన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు.

నీతి కథలపై విద్యార్థులకు అవగాహన

రామగుండం: అబాది రామగుండంలోని మండల పరిషత్ పాఠశాలలో నీతి కథలపై బుధవారం ఉపాధ్యాయుల బృందం పోస్టర్లతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హైస్కూల్ హెచ్‌ఎం.అరుణ, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాంపెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ తమ పాఠశాలను ఆదర్శ పాఠశాలగా ఎంపిక చేసినట్లు జిల్లా విద్యాధికారి మాధవి ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక రిసోర్స్ పర్సన్స్‌తో ఉపాధ్యాయులకు ఒరియెంటేషన్ ప్రోగ్రాంపై శిక్షణ నిర్వహించారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సమ్రీన్, బొమ్మర వేణి లక్ష్మణ్, అన్నం శ్రీనివాస్, సమీయుల్లాఖాన్, శ్రీదేవి, సుభాషిణి తదితరులున్నారు.

అంగన్‌వాడీలో పోషణ్ పక్వాడా

రామగుండం: స్థానిక రైల్వేస్టేషన్ ఏరియాలోని రహ్మత్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ్ పక్వాడాను నిర్వాహకురాలు గుర్రాల శ్రీదేవి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లుల సమక్షంలో చిన్నారుల పోషణకు తీసుకోవాల్సిన ఆహార పదార్థాలలో ముఖ్యంగా మిల్లెట్స్ వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త షాహెదాబేగం, చిన్నారుల తల్లులు తదితరులున్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మల్యాల అంగన్‌వాడీ కేంద్రంలో చిరుధాన్యాలపై మహిళలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సావిత్రి అవగాహన కల్పించారు. చిరుధాన్యాల్లో అధిక పోషకాలు, ఫైబర్ ఉంటుందని అవి ఆరోగ్యానికి మేలు చేస్తాయన్నారు. ఆరోగ్యవంతమైన జీవనానికి చిరుధాన్యాలు వాడాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కదారి సుమలత, ఏఎన్‌ఎంలు, ఆశాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం హన్మంతునిపేటలో బుధవారం పోషణ్‌పక్వాడా నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ తీగల సదయ్య, అంగన్‌వాడీ టీచర్లు రేణుక,పద్మ,చంద్రయ్య,రవి,తదితరులున్నారు.

నిరుపేదలకు కుట్టు మిషన్లు అందజేత

ధర్మారం: మండల కేంద్రంలోని నిరుపేద మహిళలకు బుధవారం ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ సహకారంతో అందించిన మిషన్లను ఎంపీపీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆవుల లత, వార్డుసభ్యులు దేవి రేణుక, దేవి లావణ్య, ధనలక్ష్మి, రజిత, భవాని, స్రవంతి పాల్గొన్నారు.

నియామకం

టీపీసీసీ ఓబీసీ రాష్ట్ర జాయింట్ కో ఆర్డినేటర్‌గా శ్రీకాంత్ గౌడ్

రామగుండం: మల్యాలపల్లి గ్రామానికి చెందిన నూతి శ్రీకాంత్‌గౌడ్‌కు టీపీసీసీ ఓబీసీ విభాగం రాష్ట్ర జాయింట్ కోఆర్డినేటర్‌గా నియమిస్తూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి హర్కర వేణుగోపాల్‌రావు ఉత్తర్వులు అందజేశారు. రాష్ట్ర కమిటీలో అవకాశం కల్పించిన ఏఐసీసీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాజీద్‌ఖాన్, పల్లికొండ శ్యాంలకు శ్రీకాంత్‌గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

యువజన విభాగం అధికార ప్రతినిధిగా రెడ్డి శీను

గోదావరిఖని: బీఆర్‌ఎస్ పార్టీ యువజన విభాగం అధికార ప్రతినిధిగా రెడ్డి శీనును నియమించారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నియామక పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.

వైభవంగా శ్రీసీతారామ స్వామి ఎదుర్కోళ్లు


పూజలు చేస్తున్న భక్తులు

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని పాండవుల గుట్ట శ్రీజగత్‌మానీశ్వరాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం శ్రీసీతారామ స్వామి వారల ఎదుర్కోళ్లు శ్రీవాసవికన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం మహిళలు స్వామి వారలకు పట్టువస్త్రాలు అలంకరించారు. వేదపాఠశాల విద్యార్థులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగింపుగా పాండవుల గుట్టకు తీసుకువెళ్లారు. మహిళలు మంగళహారతులు పాడారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆడెపు శ్రీదేవి, వైస్ ఎంపీపీ జూకంటి శిరీష, ఉప సర్పంచ్ కరుణాకర్ రావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి సహకార సంఘాల కృషి


మాట్లాడుతున్న చైర్మన్ వేణుగోపాల్‌రావు

ఎలిగేడు: రైతుల అభ్యున్నతికి సహకార సంఘాలు కృషి చేస్తున్నాయని సింగిల్‌విండో చైర్మన్ పుల్లూరి వేణుగోపాల్‌రావు అన్నారు. బుధవారం ధూళికట్ట సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రోజు రోజుకు సహకార సంఘాన్ని బలోపేతం చేస్తూ అభివృద్ధి వైపు ముందుకు సాగుతున్నామని తెలిపారు. రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి సొసైటీ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. స్వల్ప కాలిక, దీర్ఘకాలిక రుణాలు ట్రాక్టర్, డైరీ, గొర్రెల, మేకల పెంపకం, హార్వెస్టర్, కర్షకమిత్ర (ఎల్‌డీ), మైనర్ ఇరిగేషన్ వంటి రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు. పాలకవర్గం సంఘం అభివృద్ధి, రైతుల అవసరాలను తీర్చేందుకు సహకరిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచులు మాంకాళి తిరుపతి, బంటు ఎల్లయ్య, కుంటూరి రాజయ్య, జూలపల్లి ఏఎంసీ చైర్మన్ కంది చొక్కారెడ్డి, డైరెక్టర్లు పోల్సాని పుల్లారావు, బత్తిని లచ్చయ్య, కొమ్ము భూమయ్య, రెవెళ్లి సమ్మయ్య,అంజయ్య, సీఈవో రవీందర్‌రెడ్డి, బ్యాంకు మేనేజర్ రమేశ్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకలను అణిచివేస్తున్న కేంద్రం


నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జ్యోతినగర్: ప్రశ్నించే గొంతుకలను అణచివేసే విధంగా రాహుల్ గాంధీపై అనర్హత వేటును వేయడం దుర్మార్గపు చర్య అని కాంగ్రెస్ పార్టీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్ అన్నారు. ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం కార్పొరేషన్ బీసీ సెల్ అధ్యక్షుడు గట్ల రమేశ్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన చేపట్టి అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ సంస్థలకు ఎర్ర తివాచిపరుస్తున్న కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మురళీకృష్ణగౌడ్, మాజీ ఎంపీపీ ఉరుమెట్ల రాజలింగం, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు రమేశ్, రహీం, ఎంచర్ల మహేశ్, రవి, కళ్యాణ్, అబ్దుల్లా, కనకరాజు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న కానిస్టేబుల్ సురేశ్

రామగుండం: సైబర్ నేరాలపై మల్యాలపల్లి, అంతర్గాం హైస్కూల్స్ విద్యార్థులకు సైబర్ క్రైం కానిస్టేబల్ సురేశ్ బుధవారం అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు ఏ విధంగా ఉంటాయి, వాటికి ఏ విధంగా దూరంగా ఉండాలనే అంశాలపై విద్యార్థులకు సంపూర్ణ అవగాహన కల్పించారు. అంతర్గాం హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు జూనియర్లు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్లో హైస్కూల్ హెచ్‌ఎం.ఇరుగురాల ఓదెలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు.

ధర్మారం: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో బుధవారం సైబర్ నేరాలపై ఏఎస్సై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ అంబాసిడర్లుగా మణికుమార్, శివకృష్ణలతో పాటు విద్యార్థులు సాయి మధవ్, సిద్దార్థ్, సింధూజ, స్వామిలను నియమించి వారికి ఏఎస్సై వేణుగోపాల్ బ్యాడ్జీలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దీనా, పోలీసులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

కోల్‌సిటీ: స్లాటర్‌హౌస్ లోనే మేకలు, గొర్రెలను కోయాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో నగరంలోని మాంసం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. నిబంధనలు అతిక్రమించి విచ్చలవిడిగా మాంసం విక్రయాలు జరుపుతున్నారని అనేక ఫిర్యాదులు వస్తున్నట్లు తెలిపారు. మాంసంపై మున్సిపల్ స్టాంపింగ్ లేకుంటే సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. స్లాటర్ హౌజ్‌కు రోడ్డు సౌకర్యం లేదని, వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అక్కడికి వెళ్లలేమని వ్యాపారస్తులు సమస్యలు వెల్లడించారు. మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని, తప్పనిసరిగా నిబంధనలు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. ఇక నుంచి మాంసం విక్రయాలను సక్రమంగా జరగడానికి శానిటరీ సూపర్‌వైజర్లు తనిఖీలు నిర్వహిస్తారని, వారికి వ్యాపారస్తులు సహకరించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

విద్యార్థులు అబ్దుల్‌కలాంను ఆదర్శంగా తీసుకోవాలి

ఓదెల: విద్యార్థులు అబ్దుల్‌కలాంను ఆదర్శంగా తీసుకోవాలని మండల రైతు సంఘం చైర్మన్ కావటి రాజు అన్నారు. బుధవారం మండలంలోని పొత్కపల్లి హైస్కూల్‌లో విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నతశిఖరాలను అధిరోహించాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్రృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ ఆళ్ల రాజిరెడ్డి, స్కూల్ చైర్మన్ మౌనిక, బాయమ్మపల్లె సర్పంచ్ తొల్సూరి కొంరయ్యయాదవ్, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు రవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేత

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పెగడపల్లి జెడ్పీ హైస్కూల్, సరస్వతీ విద్యాలయంలో బుధవారం నవచైతన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్పంచు ఆరెల్లి సుజాత పదో తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు అందజేశారు. విద్యార్థుల రేపటి భవిష్యత్తుకు పదో తరగతి పరీక్షలు పునాదిలాంటివని ఎంఈవో ఆరెపల్లి రాజయ్య అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుముకం నిర్మల, ఉప సర్పంచ్ సుకేందర్ రెడ్డి, హెచ్‌ఎం సుదర్శన్, ఎస్‌ఎంసీ చైర్మన్ కంకల ఓదెలు, నవచైతన్య యూత్ అసోసియేషన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన జర్నలిస్టు జనగామ నిరంజన్ కుటుంబానికి రూ.68వేల ఆర్థికసాయాన్ని స్థానిక ప్రెస్‌క్లబ్ లో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు సంపత్‌కుమార్ అందించారు. సంఘ సభ్యులు స్పందించి అందించిన సాయాన్ని నిరంజన్ కుటుంబానికి అందించి అండగా నిలిచామన్నారు. నాయకులు చంద్రమౌళి,అశోక్, మల్లేశ్, గౌస్‌పాష,రమేశ్, నరేశ్ రవికుమార్ సాబిర్‌పాషా తదితరులున్నారు.

శానిటరీ ప్యాడ్ల పంపిణీ

రామగిరి: మండలంలోని కల్వచర్ల, రత్నాపూర్, బేగంపేట, నాగెపల్లి, కస్తూర్బా పాఠశాలలోని విద్యార్థినులకు బుధవారం సెంటనరీకాలనీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురుపెల్లి సోమశంకర్, సునీల్‌బాబు అందించిన శానిటరీ ప్యాడ్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సై దివ్య, సర్పంచ్‌లు పల్లె ప్రతిమ, గంట పద్మ, క్లబ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

అవయవదానానికి అంగీకార పత్రం

కోల్‌సిటీ: మరణానంతరం నేత్రాలు, అవయవ, శరీరదానం చేస్తామని సింగరేణి ఆధ్వర్యంలో టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న యువతులు, మహిళలు అంగీకారపత్రం రాసిచ్చారు. శిక్షణ స్థలంలో బుధవారం సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు అవగాహన కల్పించగా వారు ముందుకొచ్చారు. వారికి ట్రెయినర్ గోలివాడ చంద్రకళ చేతులమీదుగా ఫౌండేషన్ ప్రతినిధులు డోనర్ కార్డులు అందించారు.

చలో ఢిల్లీ విజయవంతం చేయండి

పెద్దపల్లిరూరల్: కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న తలపెట్టిన చలోఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు అన్నారు. పెద్దపల్లిలో బుధవారం కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. నిరుపేద కూలీలకు పని కల్పించే ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోందని ఆరోపించారు. నాయకులు ఆరెపల్లి చంద్రయ్య, శ్రీనివాస్, సదయ్య, రాజేశ్, అశోక్, బడుగు శ్రీనివాస్, నర్సయ్య, లక్ష్మి, రాజేశ్వరి తదితరులున్నారు.